# ఆంధ్ర శాసనాలు- సాహిత్యంలో ప్రతిఫలించే

# దేవదాసీ వ్యవస్థ



డా ॥ యన్. రామగోపాల్ రెడ్డి

# ఆంధ్ర శాసనాలు – సాహిత్యంలో ప్రతిఫలించే దేవదాసీ వ్యవస్థ

**యన్. రామగోపాల్ రెడ్డి, ఎం.ఏ., పిహెచ్.డి.**



ఈ పుస్తక రచనలో సహాయ సహకారాలందించిన డా॥ గల్లా చలపతిగారికి(విశ్రాంత ఆచార్యులు, వేంకటేశ్వర యూనివర్శిటీ, తిరుపతి) హృదయ పూర్వక కృతజ్ఞతలు.....



అంకితం

నాకు జన్మనిచ్చి నా ఉన్నతికి పాటుపడిన

నా తల్లిదండ్రులు

నలుబోలు సుందర రామిరెడ్డి- కాంతమ్మ

# విషయాను క్రమణిక

పుటలు

ఉపోద్ఘాతం

ప్రథమాధ్యాయం

**దేవదాసీ వ్యవస్థ - ఆవిర్భావ వికాసాలు** 1 – 30

1.0 దేవదాసీ వ్యవస్థ - స్థూలావగాహన

1.1 దేవదాసి - పదచర్చ

1.2 దేవదాసి వ్యవస్థ ఆవిర్భావం

1.3 దేవదాసి వ్యవస్థ ప్రాచీనత - ఇతరదేశాలు

1.4 దేవదాసి వ్యవస్థ ఏర్పడడానికి కారణాలు

1.5 దేవదాసి - సాని

1.6 దేవదాసీ వ్యవస్థ - సంస్కృత సాహిత్యం

1.7 దేవదాసీ వ్యవస్థ - ఆంధ్రదేశం

1.8 దేవదాసీలు - నియామకాది నిబంధనలు

1.9 దేవదాసీలు - జీవనభృతి

సూచికలు

ద్వితీయాధ్యాయం

**తెలుగు శాసనాలు - దేవదాసీ వ్యవస్థ పరిణామదశ** 31 - 50

2.0 తెలుగు శాసనాలు - దేవదాసీ వ్యవస్థ స్థూలావగాహన

2.1 శాసనాల స్వభావం - దేవదాసీ వ్యవస్థావిర్భావం

2.2 ఆంధ్రదేశము దేవాలయాలు

2.3 జనజీవితంలో దేవాలయం

2.4 తెలుగు శాసనాలు - దేవదాసీల స్థితిగతులు

2.5 తెలుగు శాసనాలలో కనిపించే దేవదాసీల విధులు

2.6 భోగస్త్రీలు - కులస్త్రీలు

2.7 సానులు - భోగంకులం

సూచికలు

మూడవ అధ్యాయం

**తెలుగు సాహిత్యం - దేవదాసీ వ్యవస్థ పతన దశ** 51 - 78

3.0 తెలుగు సాహిత్యం – వేశ్యల స్థితిగతులు

3.1 వేశ్యలు – కులస్త్రీలు (అ) శివకవుల కాలం (ఆ) పోతనకాల(ఇ) వేశ్యావృత్తి

3.2 వేశ్యలు – పురవర్ణనలు

3.3 వేశ్యలు – పుష్పలావికలు

3.4 వేశ్యలు – వేశ్యవాటికలు

3.5 తెలుగు సాహిత్యం – కొందలు ప్రముఖ వేశ్యలు (అ) వరూధిని (ఆ) సానికూతలు (ఇ) కులభాషిణి

3.6 వేశ్యలు – మరికొన్ని వివరాలు

3.7 వేశ్యలు – దక్షిణాంధ్ర యుగసాహిత్యం

సూచికలు

**నాలుగవ అధ్యాయం**


**ఆధునిక కాలం - దేవదాసీ వ్యవస్థ వికృతదశ** 79 - 97

4.0 ఆధునిక కాలము - దేవదాసీలు

4.1 దేవదాసీల కులం

4.2 దేవదాసీలు - నిత్య సుమంగళులు

4.3 దేవదాసీలు ఇతర రూపాలు

4.4 దేవదాసీ వ్యవస్థ - దేవదాసీల తీరుతెన్నులు

4.5 దేవదాసీ వ్యవస్థ - చట్టపరమైన నిర్మూలన

(అ) వేశ్యావృత్తి నిరోధక చట్టాలు (ఆ) దేవదాసీ చట్టం

**సూచికలు**

ఉపసంహారం - ఉపయుక్త గ్రంథ సూచిక 98 - 101

# ఉపోద్ఘాతం

దేవదాసీ వ్యవస్థ చాలా ప్రాచీనమైనది. వైదిక కాలము నుండి మతంతో సంబంధం ఉన్న వ్యవస్థ ఇది. దేవదాసి అంటే దేవుని పరిచారిక లేక బానిస అని అర్థం. ప్రాచీనకాలంలోని బానిస వ్యవస్థలో ఇదొక భాగమని కూడ కొందరి అభిప్రాయము. బౌద్ధ సాహిత్యంలో, శాసనాలలో దేవదాసీలను బౌద్ధారామాలకు దానం చేసిన దాఖలాలున్నాయి. బౌద్ధారామాలకు నమూనాలుగా తరువాతి కాలంలో నిర్మింపబడిన వైదిక దేవాలయాలలో కూడ దాసీల ప్రసక్తి కనిపిస్తుంది.

ప్రాచీన సాహిత్యంలోనూ, కొన్ని శాస్త్రగ్రంథాలలోను దేవదాసీల ఉనికి కనిపిస్తుంది. కౌటిల్యుని అర్థశాస్త్రములో దేవదాసీలకు సంబంధించిన వివరాలు చాలా ఉన్నాయి. భారతదేశంలో రాచరికం సుస్థాపితమైన తర్వాత రాజులను సంతోషపెట్టుటకు మిగిలిన ఎన్నో విషయాలతోపాటు అందమైన స్త్రీలు ఆడుతూ, పాడుతూ అలరించే వారని చరిత్ర చెబుతున్నది. అప్పటికి నిర్మింపబడిన దేవాలయాలలోని దేవతలకు కూడ రాజు అనుభవించే భోగాన్ని సమకూర్చడానికి పరిచారికలనుంచడం, నృత్యగీతాదులతో దేవతలను ఆనందపర్చడం జరిగింది. ఇది దేవదాసీ వ్యవస్థకు ప్రారంభం.

తరువాతి కాలంలో దేవాలయాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రజలలో భక్తి విశ్వాసాలు ఎక్కువైనాయి. ప్రతి దేవాలయానికి ఆడపిల్లలను దాసీలుగా దానంచేస్తే సద్గతి కలుగుతుందనే నమ్మకం ఏర్పడింది. తల్లిదండ్రులు తమ మొదటి సంతానం బాలిక అయితే దేవాలయానికి దానం చేయడం, పిల్లలు లేని దంపతులకు చాలాకాలం తర్వాత సంతానం కలిగితే కృతజ్ఞతా సూచకంగా ఒక ఆడపిల్లను దేవాలయానికి దానం చేయడం, మొదలైన సాంఘికాచారాలు దేవదాసీ వ్యవస్థను పోషించాయి. దేవాలయాలకు దానం చేయబడిన ఆడపిల్లలు దేవుణ్ణే భర్తగా భావిస్తూ జీవితాంతం అవివాహితులుగా గడపవలసి వచ్చేది. యుక్తవయస్సు వచ్చి, లోకం తెలిసిన తర్వాత రాజులు, సంపన్నులు దేవాలయాల్లోని దాసీల అందాలను సొంతం చేసుకోవాలనుకోవడం మరోవైపు కారణాలుగా దేవదాసీ వ్యవస్థలో పతనం ప్రారంభమైనది. ఇలా పతనమైన దేవదాసీ వ్యవస్థ ఎన్నో వికృత దశలు పొంది ఆధునిక కాలంలో ప్రభుత్వ నిషేధాలకు, ప్రజల ఆగ్రహాలకు కారణమైంది.

దేవదాసీ వ్యవస్థకు వసంతకాలం మధ్యయుగం, ఆంధ్రదేశంలో మధ్యయుగంనాటి శాసనాలు, మధ్యయుగ – మధ్య యుగానంతరం సాహిత్యం దేవదాసీవ్యవస్థ క్రమ పరిణామ, వికాస, పతన వికృత దశలను చూపిస్తాయి. ఈ వ్యవస్థను గురించి ఈ వ్యవస్థలోని చారిత్రక సత్యాలను గురించి కొన్ని రచలు ఇప్పటికే ఉన్నాయి.

ఆంధ్రదేశ సంస్కృతిని గురించి వివరించిన కవి పండితులందరూ ఈ వ్యవస్థను సందర్భాన్ని అనుసరించి స్థాలీపులాక న్యాయంగా స్పృశించారు. తెలుగు సాహిత్యంలోనూ, శాసనాలలోను ఈ వ్యవస్థకు సంబంధించిన పరిశీలనాంశాలు ఎన్నో ఉన్నాయి. వీటనన్నిటిని సమగ్రంగా సేకరించి ఒక గ్రంథంగా ఎవరూ రూపొందించలేదు. ఆ దృష్టితో 'ఆంధ్రసాహిత్యంలో, శాసనాలలో ప్రతిఫలించే దేవదాసీవ్యవస్థ' అనే అంశాన్ని ఈ పరిశోధనకు గ్రహించడం జరిగింది. దేవదాసీ వ్యవస్థ పుట్టుక, వికాసం, పరిణామం, పతనం మొదలైన అంశాలన్నిటిని సమగ్రంగా పరిశీలించి సిద్ధాంతగ్రంథంగా రూపొందించడం ఈ పరిశోధన ఉద్దేశ్యం.

ఈ పరిశోధన ప్రణాళికకు తెలుగుసాహిత్యం, తెలుగు శాసనాలు ప్రధాన ఆధారాలు. వీటితోపాటు ఈ విషయాన్ని స్పృశించిన ఇతరుల రచనలు కూడా సంప్రదించబడతాయి. ఉద్దేశించబడిన సిద్ధాంత వ్యాసం నాలుగు అధ్యాయాలుగా విభజించబడినది.

'దేవదాసీ వ్యవస్థ ఆవిర్భావ వికాసాలు' అన్నది ప్రథమ అధ్యాయం. ఈ అధ్యాయంలో దేవదాసీ పద నిర్వచనం ఈ వ్యవస్థకు మూలకారణాలు. ఇత రదేశాల్లో ఈ వ్యవస్థ రూపం దేవదాసీల విధులు, వారి జీవనభృతి మొదలైన అంశాలన్ని సవిమర్శకంగా చర్చించబడుతాయి. 'తెలుగు శాసనాలు దేవదాసీ వ్యవస్థ పరిణామదశ' అనే రెండవ అధ్యాయంలో దేవాలయ నిర్మాణం, వివిధ కాలాలలో ఆలయాలకివ్వబడిన దేవదాసీల వివరాలు, సంఘంలో దేవాలయాల ప్రాధాన్యత, దేవాలయంలో దేవదాసీల విధులు, దేవదాసీల భృతికి ఇవ్వబడిన దానవివరాలు, ఆలయ పరిపాలనా వ్యవహారాలలో దేవదాసీల పాత్ర, దేవదాసీలు సానులుగా మారడం, సంఘంలోని హెూదాగల వ్యక్తులతో వీరి సంబంధాలు మొదలైన అంశాలన్నీ సప్రమాణంగా చూపబడుతాయి.

మూడవ అధ్యాయం 'తెలుగు సాహిత్యం – దేవదాసీ వ్యవస్థ పతన దశ'గా రూపొందించబడుతుంది. దేవదాసీ వ్యవస్థ కాలక్రమాన వేశ్యావ్యవస్థగా రూపుదిద్దుకొన్న విధం, వేశ్యావాటికల వర్ణనలు, సానుల సరసాలు, సానుల నియమనిష్ఠలు, సానులు ఒక తెగగా ఏర్పడిన విధం, వేశ్యలు ఆటవెలదులుగా మారడం మొదలైన విషయాలు వివరింపబడుతాయి.

'ఆధునిక కాలం – దేవదాసీ వ్యవస్థ వికృత దశ' అనే నాలుగవ అధ్యాయంలో దేవదాసీల కులం, దేవదాసీలు నిత్య సుమంగళులైన విధం, దేవదాసీల ఇతర రూపాలు, ఆధునిక సాహిత్యంలో దేవదాసీల తీరుతెన్నులు, వేశ్యావృత్తి నిరోధక చట్టాలు, దేవదాసీ చట్టం మొదలైన అంశాలు వివరించబడినాయి.

# ప్రథమాధ్యాయం

# దేవదాసీ వ్యవస్థ – ఆవిర్భావ వికాసాలు

# 1.0 దేవదాసీ వ్యవస్థ – స్థూలావగాహన

దేవదాసీ వ్యవస్థ చాలా ప్రాచీనమైనది. వేశ్యావ్యవస్థ దీనికంటే ప్రాచీనం. ఈ రెండూ ఒకే అర్థంలో వాడబడుతున్నట్లు కొన్ని సాహిత్య ఆధారాల ద్వారా తెలుస్తుంది. సాధారణ అభిప్రాయం ప్రకారం ఈ రెంటి మధ్య తేడా లేదు. దేవదాసీ వ్యవస్థ చారిత్రకంగా పొందిన పరిణామం సరిగా తెలియకపోవడం వల్ల, దేవదాసీలంటే కేవలం సమాజంలోని సంపన్న పురుషుల భోగార్థం ఉపయోగపడే సానులుగా అనుకోవడంవల్ల ఈనాటి వారికి దేవదాసీలంటే వేశ్యలనే అనిపిస్తుంది. ప్రాచీన కాలంలో దేవదాసీలది ఒక పవిత్రమైన వ్యవస్థ. వేశ్యలకు, వీరికి ఎంతో తేడావుంది. సమాజంలో దేవదాసీ వ్యవస్థకు ఎంతో గౌరవం ఉండేది. దేవదాసీలు దేవాలయంలో దేవుని ముందు నృత్యం చేసేవారు. దేవాలయానికి సంబంధించిన ప్రతి విషయంలోనూ వీరిపాత్ర వుండేది. వీరు స్వార్థచింతన లేకుండా భగవంతుని నృత్యగీతాదులతో ఆరాధించేవారు.

ఆకాలంలో రాజాస్థానాలలో పనిచేసే స్త్రీలు రాజదాసీలుగా పిలువబడేవారు. వీరిలో రాజులను ఆకర్షించిన అందం, నృత్యగీతాది కళల పరిచయం కల యువతులేకాక, రాజులు దండయాత్రలలో స్వాధీనం చేసుకొని దాసీలుగా తెచ్చుకొన్న యువతులుకూడా ఉండేవారు. వీరు రాజాస్థానాలలో సంగీత నృత్యాదులను ప్రదర్శించి రాజులకు ఆనందం కలిగించడమే కాక రాజాంతఃపురాలలో పరిచారికలుగా కూడా పనిచేసేవారు. వీరంతా క్రమంగా రాజవేశ్యలుగా మారినట్లు చరిత్ర కథనం. దాసీ అంటే అన్ని పనులతోపాటూ లైంగిక విషయాలలో కూడా వాడుకోదగిన స్త్రీ అని ఆకాలపు వారు భావించేవారు. దేవదాసీ వ్యవస్థ, రాజదాసీ వ్యవస్థ కొంతకాలం సమాంతరంగా నడిచాయి. దేవదాసీలు భగవంతుని సేవిస్తే రాజదాసీలు రాజును సేవించేవారు. ఈ రెండు వ్యవస్థలలోనూ సేవ సమానాంశం. రాజు సాక్షాత్తు భగవత్స్వరూపం అనే విషయం స్థిరపడినప్పుడు ఈ రెండువ్యవస్థలు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా కొనసాగాయి. రాజదాసీలో లేని పవిత్రత దేవదాసీలలో ఉన్నప్పటికి వీరిద్దరిని ఒకేరకంగా చూడడంవల్ల కొంతకాలానికి దేవదాసీకి కూడా అపవిత్రతను అంటగట్టడం మొదలైంది. అప్పటినుండి దేవాలయ పరిచారికల దృష్టి భగవదంశాలనుండి లౌకిక అంశాలవైపు మరలించబడింది. రాచవ్యవస్థ, సాంఘికవ్యవస్థ, ఆలయవ్యవస్థ దేవదాసీల దృష్టిని మార్చడంలో విజయం సాధించాయి. దేవాలయాలలో ఎంత పవిత్రమైన జీవితం గడుపుతూవున్న దేవదాసీలు కూడా మనుషులే కాబట్టి సంఘంలోని వివిధ వర్గాలకు చెందిన పురుష ప్రేరణకు బలియై లౌకిక, లైంగిక స్పర్శలకు లోబడినారు. దీనితో దేవదాసీ వ్యవస్థలోని పవిత్రత తగ్గిపోవడం ప్రారంభమైనది. దేవునికి దాసీలుగా వుండిన వీళ్ళు ఇతర సంపన్న పురుషుల లైంగిక దాసీలుగా మారడం, సంతానవతులు కావడం, తరువాత జరిగిన పరిణామాలు.

దేవాలయాలలో పరిచారికలుగా ఉండిన స్త్రీలను దేవదాసీలని భావించడం జరిగిందేకాని దేవదాసీ అనే పదం సాహిత్యంలోగాని, శాసనాలలోగాని ఎక్కువగా కనిపిస్తాయి. దేవాలయ నిర్మాణంతోపాటు దేవదాసీ వ్యవస్థ స్థిరపడింది. సంస్కృత సాహిత్యం దేవాలయాలలో సంగీత నృత్యాది కార్యక్రమాలలో నిమగ్నమైనవారిని దేవుని చామరవీజనాద్యుపచారములు చేసేవారిని వేశ్యలుగానే పిలిచింది. సంస్కృత సాహిత్యంలో ఒకరకంగా దేవదాసీకి, వేశ్యకు లేక వారవిలాసినికి పెద్దతేడా కనిపించదు. దీనికి చారిత్రక కారణాలున్నాయి. దేవదాసీ వ్యవస్థ, ఆవిర్భావ వికాసాలను గురించి చర్చించినపుడు ఎన్నో చారిత్రక విషయాలు వెలుగులోకి వస్తాయి. ఈ విషయాలను చర్చించడానికి ముందు 'దేవదాసీ" పద వ్యుత్పత్తి వివరాలను వివరించడం అవసరం.

## 1.1 దేవదాసి – పదచర్చ

'దేవదాసి' అంటే దేవతల పరిచారిక అని అర్థం. ఇది దేవ, దాసి అనే రెండు పదాల కలయికచే ఏర్పడిన ఒకసంస్కృత సమాసం. 'దేవానాం దాసీ' (షష్ఠీతత్పురుష సమాసం). దేవాలయదాసీ (చతుర్థీ తత్పురుష సమాసం) అని ఈపదాన్ని వివరించవచ్చు. దేవతలకోసం ఏర్పడిన పరిచారిక అని ఈ సమాసాలకు అర్థం చెప్పవచ్చు. దేవదాసీ అనేపదం అన్ని నిఘంటువులలోనూ కనిపిస్తున్నది. V.S. Apte సంస్కృత నిఘంటువులో ఈ పదానికి రెండురకాల అర్థాలు చెప్పబడినవి.

1. A female in service of god or at temple.
2. A courtesan employed as a dancer in a temple.

H.H. Wilson Sanskrit - English నిఘంటువులో ఈపదానికి Courtesan or Harlod అనే అర్థం ఇవ్వబడింది. Minior, William తన సంస్కృత నిఘంటువులో Female Servant in the temple అని Female nautch girl అని అర్థాలు చూపించాడు. సంస్కృత నిఘంటువులల్లో కనిపించే ఈ వివరణనుబట్టి దేవదాసి అంటే దేవతల పరిచారిక అని, దేవాలయాల్లో నివసించే వేశ్య అని స్ఫురిస్తూవుంది. దేవతల పరిచారిక అనే అర్థం కంటే దేవాలయ వేశ్య అన్న అర్థం చూపడానికే ఈ నిఘంటువులలో ప్రయత్నం కనిపిస్తుంది. ఈ నిఘంటువులు తయారుచేసేనాటికి దేవదాసి వేశ్య అనే నింద్యార్థంలో స్థిరపడడమే దీనికి కారణం అని చెప్పవచ్చు. చారిత్రకంగా పరిశీలించినపుడు దేవదాసి, వేశ్య వేర్వేరు వ్యవస్థలకు సంబంధించినట్లు తెలుస్తుంది. దేవదాసీలు దేవాలయాల్లో దేవునిముందు నృత్యం చేసేవారు. వీధుల్లో నృత్యం చేయడం అప్పటికి నిషిద్ధం. వేశ్యలు రాజస్థానాల్లో నృత్యం చేసేవారు. The Devadasies in olden days were not courtesans.[1] తరువాత కాలంలో దేవదాసికి, వేశ్యకు కూడా తేడా లేకుండాపోయింది. దేవదాసికి వారకాంత, గణిక, మొదలైన సమానార్థక పదాలెన్నో తయారయ్యాయి.

సంస్కృత నిఘంటువులు దేవదాసీ అనే సమాసంలోని దేవ, దాసి అనే పదాలకు విడివిడిగా అర్థం చెప్పాయి. దేవ అంటే దేవుడు. దాసి అంటే బానిసస్త్రీ, లేక పరిచారిక. దేవ అనే పదం 'దే'(దేవ్) అనే ధాతువు నుండి నిష్పన్నమైంది. దీనికి రక్షించు, క్రీడించు, ప్రకాశించు అనే అర్థాలున్నాయి. 'దాసి' అనేమాట 'దా' అనే ధాతువు నుండి నిష్పన్నమైంది. ఇచ్చుట అని ఈ ధాతువుకు అర్థం[2]. ఈ ధాతురూపాలు ఇచ్చే అర్థాన్నిబట్టి దేవదాసీ పద అంతరార్థాన్ని ఇలా ఊహించవచ్చు. దేవాలయంలో దాసిగా చేరిన స్త్రీ దేవుడికి సంబంధించిన అన్ని విషయాలలో సేవాధర్మం నిర్వహిస్తే దేవుడు ఆమెను రక్షిస్తాడని, ఆమెతో క్రీడించి ఎంతో తేజస్సును కలిగిస్తాడని నమ్మవచ్చు. దేవుని సేవకు తనను తాను సమర్పించుకొని ఇహపరసాధకమైన రక్షణను పొందేది దేవదాసి అని చెప్పడం సమంజసంగా ఉంటుంది. ఇక దేవదాసి పదానికి తెలుగు నిఘంటువులు చూపించిన అర్థ వివరాలు ఇలా వున్నాయి.

| | | | |
|---|---|---|---|
| దేవదాసి | - | దేవతల పరిచారిక, వేశ్య | శబ్దార్థ దీపిక |
| దేవగణిక | - | అప్సరస, దేవ వేశ్య | సూర్యరాయాంధ్ర నిఘంటువు |
| దేవదాసి | - | దేవతల పరిచారిక | |
| దేవపశువు | - | (యజ్ఞాలలో) దేవతలకు ఈయబడిన పశువు | |
| దేవదాసి | - | దేవతల పరిచారిక, దేవాలయములలో స్వామి కొలువులో నృత్యగీతాదులు నెరపుటకు నియుక్తురాలైన కళాకారిణి, ఉంపుడుగత్తె, వేశ్య | ఆంధ్రశబ్దరత్నాకరము |
| దేవదాసి | - | దేవళములో సేవచేయు భోగముది - | శబ్దార్థ దీపిక |
| దేవవేశ్యలు | - | దేవలోకమందలి వేశ్యలు, పర్యా. అప్సరసలు, స్వర్వేశ్యలు – ఊర్వశి, మేనక, రంభ, ఘృతాచి, తిలోత్తమ మొదలగువారు | శబ్ద భాస్కరము |
| దేవదాసి | - | వేశ్య, గుడిసాని, ఆటవెలది, వారకాంత, వెలయాలు మొదలైన 80 పర్యాయపదాలు యివ్వబడినాయి | జియన్‌రెడ్డి తెలుగు పర్యాయపద నిఘంటువు |
| దేవదాసి | - | Dancing girl, Deva-God; Dasi - Servent; these devadasies also called Vesyalu and Bhoga Streelu, married to the God and there after promiscuons | Gallettis Telugu Dictionary (A Dictionary of cur rent Telugu 1935) |
| దేవర దున్నపోతు | - | తిని స్వేచ్ఛగా తిరిగేమనిషి, దేవ ప్రీతిగా విడిచే దున్నపోతు - | పదబంధ పారిజాతం |

పైన చూపిన తెలుగు నిఘంటువులన్నిటిలో కనిపించే దేవదాసి, దానికి సజాతీయాలైన దేవర దున్నపోతు, దేవగణిక, దేవపశువు, దేవవేశ్య మొదలైన ఇతరపదాలు చూపబడినాయి. వీటన్నిటిలో దేవ అన్నది సమానపదం. ఈ నిఘంటువులను కూర్చిన వారంతా ఆధునికులే. కాబట్టి దేవదాసి పదానికి వేశ్య అన్న అర్థమే వీరికి స్ఫురించింది. ప్రస్తుత కాలంలో దేవదాసిని వేశ్యగానే అర్థంచేసుకోవడం దీనికి కారణం. అయినా వీరు కూర్చిన దేవర దున్నపోతులాంటి సజాతీయ పదాలనుబట్టి కొన్ని మౌలిక విషయాలు స్ఫురిస్తాయి. దేవగణిక, దేవవేశ్య అనే పదాలకు అప్సరస అనే అర్థం చెప్పవలసివుంది. మేనక, రంభాదులు, అప్సరసలు, వీళ్ళు దేవేంద్రాది దేవతలను తృప్తిపరచడానికి సృజింపబడినవారు. ఈ అప్సరసలంతా దేవయోని విశేషాలు.

"విద్యాధరోప్సరో యక్షోరక్షో గంధర్వ కిన్నరాః
పిశాచో గుహ్య కస్సిద్ధో భూతో మీ దేవయోనమః" – అమరం

దేవేంద్రుని కొలువులో నృత్యగీతాదులతో దేవతలను ఆనందపరిచే కళాకారిణులు వీరు. దేవతల కోర్కెలను సయితం మన్నించవలసిన దేవదాసీలు వీరు. ద్రవ్యాపేక్ష లేకుండా దేవతల కోర్కెలను ఈడేర్చే దేవగణికలు వీరు. భూలోకంలోని వేశ్యలు ఈ దేవగణికల అంశాలకు చెందినవారుగా భావిస్తారు. భూలోకంలోని దేవాలయాలలో నియుక్తురాండ్రైన దేవదాసీలు, దేవవేశ్యలు దేవతలను సేవించినట్లు దేవాలయంలోని దేవతలను సేవించవలెననే అర్థం ఈ నిఘంటువులన్నిటా కన్పిస్తుంది.

వైదికయుగంలో కర్మకాండకు అధిక ప్రాధాన్యం వుండేది. జంతుబలులు పుణ్యకార్యాలుగా భావింపబడేది. వైదిక కర్మకాండలోని భాగంగా దేవతలకు పశువులను బలి యివ్వడం నేటికీ అక్కడక్కడా కనిపిస్తున్నది. దేవరదున్నపోతు, దేవపశువు అనే పదాలు ఈకోవకు చెందినవే. దేవర దున్నపోతు అంటే దేవునికి ప్రీతిగా విడిచిన దున్నపోతు అని అర్థం. ఈ దున్నపోతు అడ్డు ఆపులేకుండా స్వేచ్ఛగా తిరుగుతుంది. పైర్లు నాశనం చేస్తున్నా చూచినవారు తరుముతారే కాని దండించరు. వాళ్ల దృష్టిలో అది ఒక పవిత్రమైన జంతువు. ఇలాంటి జంతువులు కొన్ని నిర్ణీత పర్వదినాలలో బలియైపోయేవి. ఈవిధంగా బలియైపోయిన జంతువులకు, ఆ జంతువుల యజమానులకు సద్గతి కలుగుతుందని ఒక ప్రాచీన నమ్మకం. ఇది మతాచార విధికి సంబంధించిన అంశం. ఈ మతాచార విధిలోనే దేవదాసీ వ్యవస్థకూడా వికసించింది. ఒక దేవుడికి ఒక జంతువును వదిలేసినట్లు ఒక దేవాలయానికి ఒక అమ్మాయిని సమర్పించడం వైదిక సంస్కృతిలో ఒకభాగం. ఇలా స్త్రీలను దేవాలయాలకు సమర్పించడానికి, తరువాత వాళ్ళు దేవదాసీలుగా మారడానికి మరెన్నో ఇతర కారణాలు కూడా వున్నప్పటికీ పైన వివరించిన మతకారణమే ప్రధానమైనది. దేవ పశువుకు స్వేచ్ఛ వున్నట్లు దేవదాసీకి కూడా దేవాలయ విధులలో స్వేచ్ఛ వుండేది. దేవాలయ వ్యవస్థలో రాజకీయాంశాలు చోటు చేసుకొన్నప్పటినుండి దేవదాసీల స్వేచ్ఛ కొంత హరించబడింది. ఈ విషయాలకు సంబంధించిన అనేకాంశాలు ఇతర అధ్యాయాలలో సందర్భాన్ననుసరించి వివరింపబడుతాయి.

"దేవదాసి" శబ్దానికి పర్యాయపదాలుగా కనిపించే వేశ్య గణిక, సాని, వార విలాసిని, మొదలైన పదాలన్నీ చారిత్రక పరిణామంలో దేవదాసీ వ్యవస్థ పొందిన భిన్న పతనావస్థలలో ఏర్పడినవి. ఈపదాలకన్నిటికీ ఇంచుమించు శరీరాన్ని అమ్ముకొని జీవనం సాగించే స్త్రీ అనే అర్థం. దేవదాసీ వ్యవస్థ పవిత్రంగా కొనసాగుతూ వుండినకాలంలో ఈ పదానికి నింద్యార్థం లేదు. ఆనాటి సంఘంలో దేవదాసీకి ఎంతో గౌరవం వుండేది. చారిత్రకంగా ఈ వ్యవస్థ పొందిన పరిణామాన్ని వివరించడానికి ముందు దేవదాసీ వ్యవస్థ ఎందుకు ఏర్పడిందో పరిశీలించవలసిన అవసరం వుంది.

## 1.2 దేవదాసీ వ్యవస్థ – ఆవిర్భావం

దేవదాసీలు నారాయణుని తొడనుండి పుట్టిన ఊర్వశి సంతానమని పురాణాలలో పరంపరగా చెప్పకొనే కథ. పూర్వం ఒకసారి బదరీకాశ్రమంలో నరనారాయణులు తపస్సు చేసుకొంటున్నారు. ఇంద్రుడు నారాయణుని తపస్సును విఘ్నం చేయడానికి రంభ, మేనక, ఘృతాచి మొదలైన అప్సరసలను పంపాడు. వాళ్ళు బదరికాశ్రమానికి వచ్చి నారాయణుని ముందర ఒయ్యారాలు ఒలకబోశారు. కానీ నారాయణుని ధ్యానము సడలలేదు. అతడు తన తొడను చేతితో తట్టగా వెంటనే ఊర్వశి జన్మించింది. ఆమె అపురూప సౌందర్యాన్ని చూసి రంభాదుల గర్వం తొలగిపోయింది. దేవేంద్రుడు తాను చేసిన పనిని తలచుకొని తికమకపడినాడు. నారాయణుడు ఊర్వశిని దేవేంద్రుడికే యిచ్చాడు. అప్పటినుండి దేవతల మేజువాణిలో ఊర్వశి ఒకటి అయింది[3].

ఈ కథ దేవదాసీల పవిత్ర అభిజాత్యాన్ని చెప్పడానికి కల్పించిన కట్టుకథ. పురాణాలు రూపుదిద్దుకొన్నది క్రీశ 3, 4 శతాబ్దాల నుండియేనని అభిజ్ఞుల విశ్వాసం. దేవదాసీ వ్యవస్థ పురాణకాలంకంటే ముందుగానే ఉండినట్లు చారిత్రక పండితులు ఊహిస్తున్నారు. ప్రఖ్యాత చరిత్ర పరిశోధకుడైన కె.ఎ.యస్. శాస్త్రి అభిప్రాయం ప్రకారం క్రీ.శ. 1వ శతాబ్దంలోనే దేవదాసీ వ్యవస్థ కొంత వికాస స్థితిలో వుంది. ఈ కాలానికి ప్రాతినిధ్యం వహించే సంగం కాలం నాటి సాహిత్య గ్రంథాలలో దేవాలయ దాసీలను గురించిన వివరాలు వున్నట్లు ఆయన రాశాడు[4]. భారతదేశంలో మౌర్య చంద్రగుప్తుని కాలం నుండి చారిత్రక కాలం ప్రారంభమవుతుంది. చంద్రగుప్తుని ముందు ఋగ్వేద కాలం వరకు గల సుమారు '2000' సంవత్సరాల కాలాన్ని పూర్వయుగంగా గుర్తించడం జరిగింది. చరిత్ర పూర్వయుగం నాటి మత సంస్కృతిని విశ్లేషిస్తే దేవదాసీలనే పేరుతో కాకున్నా మతవిధులలో పాల్గొని నాట్యం చేసిన స్త్రీలు కన్పిస్తారు. ఆర్య సంస్కృతికి ముందే వికసించిన ఈజిప్టు నాగరికతలో ఇలాంటి స్త్రీల ప్రస్తావన వుంది. ఈ విషయాలను సరియైన ఆధారాలతో నిరూపించడం కష్టమైనప్పటికీ వీటిని తేలికగా తీసిపారేయడానికి కూడా వీలులేదు. పురావస్తుశాఖ వారు నిర్వహించిన ఖననాలలో బయటబడిన సింధూనాగరికతను ప్రతిబింబించే వస్తు సామగ్రిలో అభినయ భంగిమలో వున్న ఒక స్త్రీ ప్రతిమ గమనింపదగింది. ఇది ఆనాటి నాట్యస్థితిని నిరూపిస్తుంది. ఆకాలంలో నాట్యకత్తెలు మత, లౌకిక వ్యవస్థలలో నాట్యం చేసేవారని చరిత్ర పండితుల ఊహ. దేవాలయాల్లో దేవుని ముందు దేవదాసి నాట్యం చేస్తుందని, ఆ నాట్యం దేవునికి ప్రీతిపాత్రమవుతుందని మన ప్రాచీన సాహిత్యం చెపుతున్నది. దీనిని బట్టి దేవుని ముందు నృత్యం చేయడమే దేవదాసి కర్తవ్యంగా కనిపిస్తుంది. భారతదేశంలో నృత్యకళ ఎప్పటినుండి కనిపిస్తున్నదో తెలుసుకొంటే దేవదాసీ వ్యవస్థఆవిర్భావాన్ని కొంతవరకు నిర్ణయించవచ్చు.

### (అ) నృత్యం – ప్రాచీన దశ

ప్రతి కళ పరిణితి పొందడానికి ముందు జానపదుల ఊహలనుండి, చేష్టలనుండి ఏర్పడినట్లు పండితుల అభిప్రాయం. లలిత కళలనదగిన సంగీత, నృత్య కవిత్వాల ఆవిర్భావ విషయంలో ఈ సిద్ధాంతం పరమసత్యం. 'చిత్ర విచిత్ర కావ్యకమనీయమైన ప్రకృతి దేవతా చిద్విలాసమును చూచి ఆనంద పరవశుడై ప్రాకృత జీవియగు ప్రాక్తన మానవుడు చిందులు త్రొక్కుచు పాడిన పాటయే మానవలోక కవిత్వావిర్భావమునకు నాంది' అనేది మౌల్టన్ పండితుని సిద్ధాంతమని పింగళి లక్ష్మీకాంతం గారు చెప్పారు[5]. పాడిన పాట సంగీతానికి, తొక్కిన చిందులు నృత్యానికి పునాదులు. మొదటి ఈ రకమైన నృత్య ప్రారంభ దశ మతపరంగానే మనకర్థమవుతుంది. తరువాత నృత్యం దేవతలనుసంతృప్తిపరిచే సాధనంగా మారింది. "A dance performed with the intention of moving the dicty was considered to be the real form of prayer and hence its popularity among many ancient peoples of the world"[6]. ఇష్టదేవత ఆవేశంతో ఊగేవరకు భక్తులు వెర్రి ఆవేశంతో గంతులేసేవారు. మొదట ఇలాంటి గంతులకు లక్షణాలు లేకున్నా తరువాత లక్షణాలు ఏర్పడినాయి. క్రీస్తు శక ప్రారంభకాలంలో వెలువడిన భరతుని నాట్యశాస్త్రం[7]

ప్రాచీన భారతదేశంలోని నాట్య పద్ధతులను క్రోడీకరించి శాస్త్రీయతను సమకూర్చింది. నాట్యశాస్త్రం మొదటి అధ్యాయంలోనే నాట్యానికి, అప్సరసలకు గల సంబంధం చూపబడింది.

బ్రహ్మ చతుర్వేద సారమును గ్రహించి నాట్యమనే లలితాత్మకమైన పంచమ వేదమును సృష్టించాడు. ఇదే నాట్యవేదం. బ్రహ్మ దీనిని భరతునికి బోధించారు. అభినయానికి మంజుకేళి మొదలైన ఇరువది నలుగురు అప్సరసలను సృజించి బ్రహ్మ భరతమునికిచ్చి ప్రయోగం ద్వారా ఇంద్రాదులను ఆనందపరచమన్నారు. భరతుడు తన నూర్గురు శిష్యులకు నాట్యవేదాన్ని సాకల్యంగా నేర్పి వారిని తగిన పాత్రలలో నియమించి నాట్య ప్రదర్శనను ప్రారంభించారు. ఇది నాట్యశాస్త్రంలో చెప్పబడిన అంశం. ఇందులో అప్సరసల ప్రస్తావన వుంది. అప్సరసలు తమ నాట్యం ద్వారా దేవతలను ప్రీతిపరచినట్లు పురాణాల కథనం. ఇదేరకంగా భూలోకంలోని దేవతలను అంటే దేవాలయాలలోని దేవతలను నాట్యం ద్వారా ప్రీతిపరిచే దేవదాసీలు అప్సరసల సంతతి వాళ్లని చెప్పడం వుంది. క్రీస్తు శకారంభకాలంలో నాట్యశాస్త్రం వెలువడింది కాబట్టి అప్పటినుండి నృత్యం విపుల ప్రచారానికి ప్రాభవానికి నోచుకొన్నదని చెప్పవచ్చు. ఆకాలం నాటికే భారతదేశంలో రాచరికం సుస్థిరమై వుండడం వల్ల రాజస్థానాలలో నృత్యప్రదర్శనలు జరుగుతుండినట్లు ఊహించవచ్చు. దేవదాసీలు దేవాలయ వ్యవస్థతోపాటు అభివృద్ధి చెందినవారుగా పరిశోధకులందరూ గుర్తించిన అంశం. అయితే క్రీస్తు శకారంభ కాలానికే దేవాలయ నిర్మాణం జరిగినట్లు తెలిపే ఆధారాలు లేవు. ఆ ప్రాచీన దశలో మానవ జీవితానికి మత విశ్వాసాలకు ఎంతో సంబంధం వుండేదని మాత్రం చెప్పవచ్చు. అప్పటికే వైదిక, సూత్ర వాఙ్మయం పూర్తిగా వికసించింది. ఫలానా మత విధివల్ల ఫలానా ప్రయోజనం వుంటుందని ఈ పూర్వ సాహిత్యంలో చూపబడింది. నృత్యగానాదుల ద్వారా భక్తి పారమ్యాన్ని చూడవచ్చునని, జీవితగమ్యం చేరవచ్చునని విశ్వాసం ఏర్పడింది. ఋగ్వేదకాలంలోనే మత విధులలో స్త్రీలు పాడేవారని తెలుస్తున్నది. "Rigveda the ancient record of the Hindu's mentions that women were registered to have sung in praise of the god at the time of the squeezing out of the Somajuice.[8] దీనినిబట్టి స్త్రీలు భగవన్నుతి చేసేవారని, తరువాత కాలాలలో ఈ పని దేవదాసీలదైనదని అర్థమవుతుంది.

## (ఆ) దేవాలయ నర్తకి – రాజ నర్తకి

ప్రారంభ రాచవ్యవస్థలో రాజు భగత్స్వరూపుడుగా కీర్తించబడినాడు. 'నా విష్ణో పృథివీపతిః' అని ధర్మశాస్త్రాలు నిర్ణయించాయి. రాజులో దిక్పాలకుల అంశాలన్నీ వుండడం వలన ఆయన అధికారం అన్ని దిక్కులలో అప్రతిహతంగా చెల్లుతుందని ధర్మశాస్త్రాలు నమ్మకం కలిగించాయి. ఆయనను కీర్తించే భజనపరులు తయారయ్యారు. భార్యతో పాటు దాసీలు కూడా రాజు సేవలో వినియోగింపబడినారు. ఇలాంటి దాసీలను సూత్రసాహిత్యం విలాసినులుగా చూపింది. వీళ్ళే కొంత కాలానికి వార విలాసినులయ్యారు. ఉదయం నుండి సాయంత్రం వరకు రాజుకు కావలసిన అన్ని సౌకర్యాలు దాసీలే చూచేవారు. ఇలా రాజ్యదాసీల సంఖ్య పెరిగింది. వీళ్లలో కొందరు రాజు మానసోల్లాసం కోసం పాడేవారు, ఆడేవారు. ఆటపాటలలో నేర్పు సంపాయించి రాజును భౌతికంగానే కాక మానసికంగా కూడా సంతృప్తిపరిచేవారు రాజనర్తకీమణులుగా చలామణి అయ్యారు. వీరికి రాజ వ్యవహారాలలో జోక్యం వుండేది. రాజ్యంలో మంచి మర్యాద వుండేది. రాజుకు జరుగుతూ వుండిన ఇలాంటి మర్యాద దేవాలయలలో వుండిన దేవునికి కూడా జరపాలనే అభిప్రాయం ఏర్పడిన తరువాత దేవాలయాలలో ఇలాంటి దాసీలు తయారయ్యారు. దేవదాసీ వ్యవస్థకు ఒకరకంగా ఇదే ఆవిర్భావం అని చెప్పవచ్చు.

"The diety of an early medieval temple can be compared to a feudal lord who was provided with all the amenities and pleasures of life that were needed by a fuedel lord. The ameneties included a big and comfordable house, a host of servants, best food, choicest jewellery, attractive garments and wives and concubines. The devadasis had therefore to be employed to give company to the god as wives and concubines."[9] అన్న ఆంగ్ల వాక్యాలలో ఈ విషయం తేటపడుతుంది.

రాజస్థానాలలో నాట్యం చేసేది రాజనర్తకి. దేవాలయాలలో దేవునిముందు నాట్యం చేసేది దేవాలయ నర్తకి లేక దేవ నర్తకి. నాట్యకత్తెలలో ఇలా రెండు రకాలున్నట్లు ప్రాచీన సాహిత్యం కూడా చెపుతుంది. మూడవ సంగకాలానిదిగా చెప్పబడుతున్న తొల్కాప్పియమ్‌లో రెండు రకాల నాట్యపద్ధతులు చెప్పబడినాయి[10]. మొదటిది వల్లికుట్టు, రెండవది కలని వైకుట్టు. 'కుట్టు' అంటే నృత్యం. వల్లికుక్కుట్టు కుమారస్వామి దేవేరియైన శ్రీవళ్ళి ముందు భక్తితో చేసే నృత్యం. ఇలాంటి నృత్యం సంఘంలోని నిమ్న జాతుల ప్రజలలో ఎక్కువగా ప్రచారంలో వుండేది. కలనివైకుట్టు వున్నత తరగతి ప్రజలకు సంబంధించినది. ఇది రాజాస్థానాలలో ప్రదర్శించే నృత్యం. ఈ రెండు పద్ధతులేగాక ప్రాచీన తమిళ సాహిత్యంలో 'వెలయన్ వెరియతల్' అనే మరోరకమైన నృత్యపద్ధతి కూడా చెప్పబడింది. ఇది కుమారస్వామికి బలి ఇచ్చే సందర్భంలో చేస్తుండిన నృత్యం. ఇందులో వెర్రి ఆవేశం వుంటుంది. దేవదాసి దేవాలయంలో చేసే నృత్యంలో భక్తి, ఆవేశం రెండూ వుంటాయి. దేవదాసీల నృత్యంలో తరువాత తరువాత రక్తికూడా చోటు చేసుకొంది. ఈ పరిశీలనవల్ల దేవదాసీవ్యవస్థ ఆవిర్భావం క్రీ.శ. ఆరంభకాలంలో జరిగినట్లు నిర్ణయించవచ్చు.

## (ఇ) దేవదాసి – దేవాలయం

దేవదాసీ వ్యవస్థ ఎంత ప్రాచీనమైనప్పటికి దేవాలయాలు నిర్మింపబడినప్పటినుండి వ్యాప్తిలోకి వచ్చినదన్నది అందరూ ఒప్పుకొనే సత్యం. ఋగ్వేదకాలం నుండి మత విధులకు సంబంధించిన నృత్య ప్రదర్శనలు కనిపించినా దేవదాసీ వ్యవస్థ సంఘం గుర్తించిన వ్యవస్థగా మారినది మాత్రం దేవాలయ వ్యవస్థ స్థిరపడినప్పడినుండియే. భారతదేశంలో దేవాలయ నిర్మాణం ఎప్పటినుండి ప్రారంభమైనదో తెలుసుకుంటే దేవదాసీవ్యవస్థ ప్రాచీనతను స్థూలంగానైనా నిర్ణయించవచ్చు.

బౌద్ధమతం ఏర్పడిన కాలానికి ముందుండిన వైదిక సంస్కృతిలో దైవారాధన ఉండినదేకాని దేవాలయాలు లేవు. వైదిక కర్మకాండను నిరసించి ప్రజలలో అహింసాతత్వాన్ని నిలపడానికి బౌద్ధం జన్మించింది. ఇది క్రీస్తు పూర్వం 6, 5 శతాబ్దాల కాలం. బుద్ధుడు నిర్యాణం చెందిన తరువాత బౌద్ధ బిక్షువులు ఆయనను దేవుడుగా పూజించారు. ఆయన శరీర ధాతువులను స్వర్ణ పేటికలో ఉంచి భూగర్భంలో నిక్షిప్తం చేసి పైన స్థూపాలు నిర్మించారు. స్థూపం బౌద్ధ దేవాలయమే. అయితే అప్పటికి దానికాపేరు లేదు. బౌద్ధ దేవాలయంలో రెండు గదులుండును. ఒక గదిలో బుద్ధుని శిల్పముంటుంది. దానినానుకొని వున్న మరొకగదిలో బౌద్ధ సన్యాసులు పూజలు నిర్వహించేవారు. బుద్ధుడు దేవుడని నమ్మి అతనికి దేవాలయం (స్థూపం) నిర్మించడం, మానవరూపంలో అతనిని శిల్పంగా మలచి ప్రతిష్ఠించి పూజించడం క్రీస్తుపూర్వం నాల్గవ శతాబ్దానికే ప్రారంభమైనట్లు చరిత్రకారుల తలంపు. బౌద్ధ దేవాలయాల నమూనాలోనే ప్రారంభ దశలో వైదిక దేవతలను మానవరూపంలో ప్రతిష్ఠించి పూజించినట్లు, ఈ ఆలోచనలకు బౌద్ధమే స్ఫూర్తినిచ్చినట్లు అర్థమవుతుంది. ప్రాచీన భారతీయ శిల్పమంటే బౌద్ధశిల్పమే. నేడు లభించు ఆధారములనుబట్టి భారతీయ కళ అశోకమౌర్యుని కాలమున ప్రారంభమయ్యెనని పండితులు నిర్ణయించారు. అతడు నిర్మించిన స్తూపములు సాంచీ, సారనాథ్, గయలలో కనిపించుచున్నవి[11]. దీనినిబట్టి మౌర్యచంద్రగుప్తుని కాలంనుండి దేవాలయాల నిర్మాణం జరిగినట్లు చెప్పవచ్చు.

హిందూ దేవాలయలాకు దేవదాసీ వ్యవస్థకు అవినాభావ సంబంధముందని చెప్పడంలో సందేహం లేదు. అయితే దేవదాసీ వ్యవస్థ కూడా బౌద్ధమతం ద్వారానే హిందూమతంలోనికి వచ్చిందని చెప్పవలసి వుంది. ఆనాటి ఈ విశేషాలను తెలిపే ఇతర ఆధారాలు లేకున్నా బౌద్ధ శిల్పాన్ని పరిశీలిస్తే ఈ అంశం తేటతెల్లమవుతుంది. క్రీస్తు పూర్వం రెండు, ఒకటి శతాబ్దాల బౌద్ధ శిల్పాలను పరిశీలిస్తే ధ్యానముద్రలో వున్న బుద్ధునికి ఇరువైపులా వింజామరలు చేతులతో పట్టుకొని వున్న దివ్యస్త్రీలు కనిపిస్తారు. వీరిలో కొందరికి రెక్కలున్నట్లుగా కూడా కనిపిస్తుంది. ఇలాంటి స్త్రీలు బుద్ధుని సేవించడానికి వచ్చిన అప్సరసలుగా గమనించవచ్చు. వీళ్ళు భక్తి పారవశ్యం కలిగిన వారుగా కనిపిస్తారు. తరువాత కొంతకాలానికి మానవ కాంతలు కూడా బుద్ధుని పరివారంలో కనిపిస్తారు. "Men and women are represented in sculptures as being in ecstatic devotaion"[12]. బౌద్ధారామాలలో సేవకోసం స్త్రీలను దానం చేసే పద్ధతి వుండినట్లు కొన్ని శాసనాల ద్వారా కూడా తెలుస్తుంది. అల్లూరు (నందిగామ తాలూకా, కృష్ణాజిల్లా) శాసనంలో ఒక

బౌద్ధారామానికి చేసిన దాన వివరాలున్నాయి[13]. ఈ శాసన కాలం క్రీ.శ. రెండవ శతాబ్దం. కొంత భూమి, అరవై నాలుగు ఎద్దులబండ్లు, నాలుగు రాగిపాత్రలు మొదలైన ఎన్నో దాన వివరాలను తెలిపే ఈ శాసనంలో 'పెసరుపాసి దాసి దాసన చతాళి' అని కూడా వుంది. పాకృత భాషలో గల ఈ భాగానికి 'పనిచేయడానికి నలుగురు దాసదాసీలు' అని అర్థం. బౌద్ధారామాలలో పనిచేయడమంటే తమ విధులతోపాటు భిక్షకుల సౌకర్యాలు కూడా చూడడంగా అర్థం చేసుకోవాలి. కొంతకాలానికి ఇలాంటి స్త్రీలకు, భిక్షుకులకు మధ్య లౌకిక సంబంధాలు ఏర్పడి మత వినాశనానికి దారితీశాయి. పవిత్రమైన స్థూప మర్యాదలు మంటగలసి లైంగిక స్పర్శతో అపవిత్రమైపోయాయి. సరిగ్గా ఇదే అంశం దేవదాసీల పతనంలో కూడా గమనించవచ్చు. బౌద్ధారామాలలోని స్త్రీలుగాని, దేవాలయాలలోని దేవదాసీలుగాని పవిత్రమైన వ్యవస్థ నాశనం కావడానికి కారణమని చెప్పలేము. ఆనాటి సాంఘిక వ్యవస్థే దానికి కారణం.

బౌద్ధమతంలోని ఎన్నో అంశాలు వైదిక మతంలోనికి వచ్చాయి. దేవారాధన, దేవాలయ నిర్మాణం, స్త్రీలను దానం చేయడం మొదలైనవి ముఖ్యమైనవి. దైవారాధనలో స్త్రీలపాత్ర చాలా ప్రాచీనకాలం నుండి కనిపిస్తుంది. ఆరాధన బౌద్ధంలోనూ, వైదిక మతంలోనూ కనిపించడమేగాక బౌద్ధానికి కొంత ప్రాచీనమైన జైనంలో కూడా కనిపిస్తుంది. జైనయతులు జ్ఞానం, దర్శనం, చరిత్ర, తపస్సు అనే నాలుగు ఆదర్శాలను నిరంతరం సాధన చేస్తారు. ఇలాంటి సాధనకు ఆరాధనమనిపేరు[14]. ఈ ఆరాధనలో వీరికి స్త్రీల అవసరం ఏర్పడింది. స్త్రీలు చిత్తశుద్ధితో సమయాచారాలను బాగా పాటించి సేవ చేస్తారన్న ఉద్దేశంతో ఇలాంటి మత విషయాలలో స్త్రీలకు ప్రవేశం కల్పించబడింది. ఈ చర్య వలన మత విధులలో స్త్రీల సేవ అవసరమైందని, సేవార్థం స్త్రీలను బౌద్ధారామాలకు దానంగా యిచ్చేవారని, క్రమంగా ఈ ఆచారం వైదికమతంలో భాగమైన దేవాలయ వ్యవస్థలోనికి వచ్చిందని తేలుతుంది. దేవదాసీ వ్యవస్థ ఏర్పడడానికి మరెన్నో కారణాలున్నా పైన తెల్పిన కారణం పునాది.

## 1.3 దేవదాసీ వ్యవస్థ ప్రాచీనత – ఇతర దేశాలు

దేవదాసీ వ్యవస్థ ప్రాచీనకాలం నుండి భారతదేశమంతటా ఉన్నప్పటికీ ఉత్తర భారతదేశంలో కంటె దక్షిణ భారతదేశంలోనే దీనికి ప్రాచుర్యం ఎక్కువ. దీనికి కారణం దక్షిణ భారతదేశంలో ఉన్నన్ని దేవాలయాలు ఉత్తర భారతదేశంలో లేకపోవడమే. భారతదేశంలో ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ఈ వ్యవస్థ ప్రాచుర్యాన్ని వివరించడానికి ముందు ఇతర దేశాల సంస్కృతులలో ఇది ఎలాంటి ప్రాచుర్యం పొందిందో తెలుసుకోవడం అవసరం. భారతదేశంలో ఈ వ్యవస్థ ఏర్పడడానికి కొన్నివేల సంవత్సరాలకు ముందే మెసపుటోమియా, గ్రీసు, ఈజిప్టు, బాబిలోనియా మొదలైన దేశాలలో ఇది వికసించింది[15].

### (అ) ఈజిప్టు :–

ఈజిప్టులోని 'ఓసిరిస్' మరియు 'ఐసిస్' దేవాలయాలలో ఎందరో నాట్యగత్తెలుండేవారు. ఈదేశంలో ప్రాచీన కాలంలో స్త్రీలకు నాలుగు రకాల వృత్తులుండేవి. అవి – (1) పౌరోహిత్యం (2) మంత్రసానిత్వం (3) శోక ప్రకటన – అవసర సందర్భాల్లో శోకాన్ని వ్యక్తంచేయడం (4) నృత్యం. రాజ పురోహితురాలు చిన్నతనంలోనే ఆ వృత్తిలో చేరి దైవగీతాలను (Sacred songs) పాడడంలోనూ, దైవనృత్యాలను (Sacred dances) ప్రదర్శించడంలోనూ శిక్షణ పొందుతుంది. ఇలా శిక్షణ పొందిన స్త్రీ దేవుణ్ణే భర్తగా చేసుకొంటుంది. ఈమెకు సంతానం కలిగేయోగం లేదు కాబట్టి తనకు వారసురాలుగా ఉండడానికి ఒక చిన్న అమ్మాయిని దత్తత పొందుతుంది.

### (ఆ) బాబిలోనియా :–

బాబిలోనియాకు చెందిన 'ఇష్టర్' దేవాలయంలో ఎందరో వేశ్యలు ఉండేవారు. 'ఇష్టర్' ఒక స్త్రీ దేవత. బిసమొలతో కామేంగితాలను ప్రదర్శించే భంగిమలతో ఈమె బాబిలోనియాన్ సాహిత్యంలో కనిపిస్తుంది. "In the epic 'Gilgumesh' she has been described as insatiable, passionate and unfaithful goddess"[16]. ఈ దేవాలయానికి అప్పగించబడిన స్త్రీలందరూ 'ఇష్టర్లు' అని ఆ దేవతపేరు మీదనే పిలువబడినారు. 'ఇష్టర్' అంటే పవిత్రురాలని అర్థం. ఈదేశంలో 'మార్డుక్' అనే దేవుడి గుడిలో కూడా ఎందరో స్త్రీలు వుండేవారు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Andhra+Sasanalu+Sahityamlo+Pratiphalinche+Devadasi+Vyavastha**

* * *